


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -163-

**(19 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**దాంపత్యాల విషయంలో** ఈనాడు ఆధ్యాత్మిక ప్రభావం తరిగి ఆర్థిక ప్రభావం అధికమైంది. అసలు యువకులు వెతుక్కోవడంలోనే ఆస్తి ఎంతవుంది? ఉద్యోగం పెద్దదేనా? అది పర్మనెంటేనా? అనే ప్రశ్నలు బయలుదేరుతున్నాయిగాని గుణగణాలెటువంటివి? కరుణగలవాడా? ధర్మాలు పాటిస్తాడా? శాంతి స్వభావం కలవాడా? పోకిరీ లక్షణాలున్నాయా? సోకులమీద మోజు ఎక్కువా? ఆలిమీద జాలిపడగలవాడేనా? సంసారాన్ని సణక్కుండా ఈదగ్గలవాడేనా? ఇత్యాది ప్రశ్నలతో సంబంధం లేకుండా వుంది.

వెనుకటి రోజుల్లో ఏదైనా సంబంధం వున్నదని తెలిస్తే వారి దగ్గరకు వెళ్ళేముందు వారి కుటుంబ మర్యాదలు వగైరాలను గురించి గుఢచారులలాంటి వాళ్ళను నియమించి భోగట్టా సేకరించేవారు ముందుగా. వాటితో సంతృప్తి పడితే తర్వాత మాటాడటానికి వెళ్ళేవారు. వారి కుటుంబ చరిత్రలో ఎక్కడన్నా ఒక్క కళంకం వుందని తెలిస్తే మళ్ళీ ఆ జాడలకు వెళ్ళేవారు కాదు.

ఇప్పుడలాటి భయాలేం లేవు. కుటుంబం మంచిది కాదని తెలిస్తే

"కుటుంబం సంగతి మనకెందుకు? అతడు చాలా ఇండిపెండెంటు ఆ కొంపలో వుండనే వుండడు. ఈ ఉద్యోగాల కాలంలో ఊళ్ళతోనూ, కుటుంబాలతోనూ సంబంధాలేం వుంటాయి? కాపురం బందరు కావచ్చు, ఉంటే బరోడాలో వుంటాడో, పాట్నాలోనో వుంటాడో? అసలు వాళ్ళకు వీళ్ళకు ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా వుంటాయో వుండవో, ఇక చిక్కేం వుంటుంది. చక్కగా చేసుకోవచ్చును ఆ సంబంధం" అని గట్టిగా ఉద్ఘాటిస్తున్నారు.

"ఆ కుర్రవాడి మేనత్త భర్తను వదిలి పారిపోయిందట" అంటారనుకోండి. ఆ విషయంలో వాడికి అంత పట్టింపులేదులెండి అంటారు.

"ఆ మేనత్త భర్తని వదిలితే ఏమంత చెప్పుకోవాలి? చాలామంది అలా చేస్తున్నారీ కాలంలో ఆ దాంపత్యంలో ఏం లొసుగులున్నాయో. ఆయనతో పడలేక లేచిపోయి ఉండొచ్చు. ఏం కాల్చుకుతిన్నాడో?" వాళ్ళ స్థితిని తలచుకుని బాధపడాలేగాని ఆవిడ పేరు చెప్పి అందర్నీ వెలివేస్తుంటే ఎట్లా?

"అయినా మేనత్త సంసారానికీ, ఈ సంసారానికీ ఎక్కడ పొత్తు? చీలిపోయిన సంసారాలు. వారింటి పేరేవిటో, వీరింటి పేరేవిటో" మేనత్త లేచిపోతే మేనల్లుడి గుణం శంకించడమేమిటి విడ్డూరం అంటూ అనేక విధాలుగా సర్ది చెపుతున్నారుగాని "చాల్లెండి ఆ సంబంధానికో నమస్కారం" అని వూరుకోవడంలేదు. కుర్రవాడు సంపాదనపరుడైతే ఏ లోపాలూ, పాపాలూ కనిపించడంలేదు. అసలు అలాటి సంసారాలకు వున్న లోపాలు కూడా తొలిగిపోతున్నాయి.

కొందరు ఆడపిల్లలు కూడా సంపాదిస్తుంటే, ఉవ్విళ్ళూరుతూ, బ్రతుకు మువ్వల మ్రోతగా వుంటుందని సంబరపడుతూ తక్కిన విషయాలేమీ ఆలోచించకుండా అర్ధాంగిగా స్వీకరిస్తున్నారు. ఆర్ధిక స్తోమతు చూసుకుని ఒకరి ఆత్మ ఒకరికి నైవేద్యం పెట్టుకోవడానికి బదులు ఒకరి పర్సు ఒకరు కళ్ళకు అద్దుకుని సంతృప్తి పడుతున్నారు.

ఇంక ఒకరు ఎక్కువ ఏమిటి? ఒకరు తక్కువ ఏమిటి?

"కుంపటి మీరు విసరండి, కూరనేను తరుగుతాను. బియ్యం మీరు పత్రిక చదువుతూ ఏరి ఇలా పెట్టండి. నేను వంట చేస్తాను. గడ్డం చేసుకువచ్చి కాస్త చింతపండు పిండండి, జడ వేసుకొచ్చి నేను పొయ్యిమీద పడేస్తాను" అంటూ ప్రొద్దున పూట ఇద్దరూ ఆఫీసులకు వెళ్ళే తొందరలో పనులు పంచుకుంటూ వుంటారు.

నిజానికి ఏ ఒక్కరూ పూర్తిగా ఏ పనీ చెయ్యలేని స్థితిలోకి వచ్చేస్తారు. అర్ధ శరీరాలు అరకొర పనులకు అలవాటు పడిపోతారు. కాలక్రమేణా వాళ్ళక్కూడా పూర్తి రవాణా వుండదు. 'సగం చాలు' స్థితిలోకి వస్తాయి.

ఆఫీసు నుంచి తిరిగి వచ్చిన తర్వాత మరీ బడలికగా వుండటంవల్ల అసలు పనులు తగ్గించి, అందులో సగం సగం పంచుకుని ఎలాగో అలా కాలక్షేపం చేస్తూ వుంటారు.

'ఈ పూట కూర వండే వోపికలేదు. ఏదో పచ్చడి వేసుకుతిందాం. మీరు దోసకాయ తరగండి. రెండు పచ్చిమిరపకాయలు వేసి నూరి అవతల పారేస్తా. మధ్యాహ్నం పులుసుంది. చెరి సగం పోసుకుందాం.'

ఆవకాయ కారం నే కలుపుకుంటాను. బద్దలు మీకు యిష్టంగా, ఇంత నెయ్యి వేసుకుని మీరు నంజుకు తినండి. కంచాలు నేను ఎత్తి వస్తాను. మీరు మంచాలు కొంచెం వాల్చండి అంటూ సేవాభావాన్ని తూనికలో తూచి ప్రతి పనీ సరిగ్గా సగం తూచుకుని, ఒకరికి ఒకరు ఋణపడకుండా పై జన్మకు బ్రాటోవరు అందకుండా జాగ్రత్త పడుతూ వుంటారు – సంపాదనపరులైన జంటలు.

ఇటువంటి సంసారాలకు ఒక ప్రత్యేకతవుంటుంది. ఇద్దరూ వెళ్ళడం వల్ల పగలల్లా మసీదులాగా, రాత్రి పూట హోటల్ గదుల్లాగ తయారవుతాయి. ఆ ఇంట్లో ఎవరుండేది చాలాకాలం దాకా ఎదురింటి వాళ్ళకే తెలియదు.

కావాలంటే ఇద్దరూ ఒక రోజే సెలవు పెట్టేస్తారు. ఊరంతా హాయిగా తిరిగేస్తారు. ఖర్మం చాలక ఆవిడ మెటర్నిటీ శెలవు పెడితే, ఆయనగారు మెడికల్ లీవు పెట్టేస్తాడు. అవసరమైతే 'మేల్ నర్స్' లాగా పని చేస్తాడు.

నిజానికి అర్ధాంగులనే భావాన్ని ధర్మాన్ని వీరు నిలబెట్టినట్లు మరే యితర జంటలకూ చేతకాదు. వాళ్ళ పకపకలెలా వున్నా, రాత్రిపూట తెచ్చి బల్లమీద పారేసే వారిద్దరి పర్సులు పకపకలాడ్తూ  వుంటాయి. 'ఆ పర్సు' మరీ నవ్వుకుంటుంది తనకు లభించిన అధికారాన్ని తలుచుకుని.

పదవులలో వున్న వాళ్ళను వెతికి కొన్ని పద్దతులు ఈసారి వర్ణిస్తా.

Post your comments